సాక్షి
విశాఖపట్నం

శనివారం । 12 । జూలై । 2025

# బినామీల పేరుతో బియ్యం బొక్కేస్తున్నారు




**కూటమి కనుసన్నల్లో రేషన్ మాఫియా**

- రేషన్ డిపోల సాక్షిగా పేదల బియ్యం పక్కదారి
- ఎస్‌హెచ్‌జీల పేరుతో బినామీల చేతుల్లోకి తీసుకున్న కూటమి నేతలు
- డిపో అడ్రస్ ఒకచోట.. నిర్వహించేది మరోచోట
- చోద్యం చూస్తున్న పౌర సరఫరాల శాఖ అధికారులు

సాక్షి, విశాఖపట్నం :

- ఈ నెల 4న ఆదర్శనగర్‌లో సుమారు 2750 కిలోల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.
- జూన్ 6న ఆనందపురం మండలం పెద్దిపాలెంలో రెండు రైస్ మిల్లుల నుంచి భారీగా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- జూన్ 2న అక్రమంగా తరలిస్తున్న 1500 కిలోల రేషన్ బియ్యాన్ని తాటిచెట్ల పాలెం సమీపంలో పోలీసులు పట్టుకున్నారు.

ఇవి కేవలం చిన్న తిమింగళాలే.. కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతున్న రేషన్ మాఫియాకు పౌర సరఫరాల శాఖ అధికారులే వత్తాసుపాడుతున్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరఫరాని కూటమి ప్రభుత్వం నిలిపేసిన తర్వాత.. పేదోడి బియ్యం పక్కదారి పట్టడం మరింత ఎక్కువైపోయింది. రేషన్ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ సివిల్ సప్లై అధికారులు నెపాన్ని నెట్టేస్తున్నా.. అసలు ఈ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలింపు వెనుక కొందరు అధికారుల హస్తలాఘవం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం ప్రతీనెలా రేషన్ బియ్యాన్ని ఉచితంగా అం**దిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 642 చౌకధరల దుకాణాల ద్వారా 5,24,986 మంది కార్డుదారులకు 8,216.12 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతి నెలా సరఫరా చేస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాలు ఆ వీధికే వెళ్లి.. లబ్ధిదారులకు రేషన్ బియ్యం, ఇతర సరకులు అందించేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక సామాన్యుడి చెంతకు బియ్యం వెళ్లడమేంటనే అక్కసుతో వాహనాల్ని రద్దు చేసి రేషన్ దుకాణాల్ని మళ్లీ తెరిపించింది. ఇదే బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు కీలక మార్గంగా మారిపోయింది.

**అడ్రస్ ఒక చోట.. నిర్వహణ మరోచోట**

జిల్లాలోని కూటమి నేతలు బియ్యాన్ని బొక్కేసేందుకు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రేషన్ డిపోలు తమ కనుసన్నల్లో నడిచేలా పక్కా ప్లాన్ చేసుకున్నారు. ఎవరైనా డీలర్లు తమ మాట వినకపోతే వారిని తొలగిస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో కొందరు డీలర్లు సైతం కూటమి నేతలకు తలొగ్గాల్సిన పరిస్థితి దాపురించింది. దీంతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. స్వయం సహాయక బృందాలకు ఇచ్చిన రేషన్ దుకాణాల్ని తమ గుప్పిట్లోకి లాక్కున్నారు. అడ్రస్‌లు ఒక చోట ఉంటే డిపోల నిర్వహణ ఇంకో చోటికి మార్చేసి బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా తరలించేస్తున్నారు. పూర్ణామార్కెట్ ఏరియాలో ఉన్న దుకాణాన్ని ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన ఎస్‌హెచ్‌జీకి కేటాయించారు. కానీ అధికార పార్టీకి చెందిన నాయకులు ఆ దుకాణాన్ని పూర్ణామార్కెట్ ప్రాంతంలో కాకుండా ఏకంగా పెందుర్తిలో పెట్టేశారు. ఇలా నగర పరిధిలో మరో నాలుగు రేషన్ డిపోలు నడుస్తున్నాయి. మరికొన్ని చోట్ల బినామీల పేరుతో తామే స్వయంగా నడిపేస్తున్నారని తెలిసినా అధికారులు మాత్రం ఏమీ తెలీనట్లు వ్యవహరిస్తున్నారు.

## పౌర సరఫరాల అధికారులే సూత్రధారులై..

బ్లాక్ మార్కెట్‌కు బియ్యం తరలిపోతున్న వ్యవహారంలో కొందరు పౌర సరఫరాల శాఖ అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. సర్కిల్–1 పరిధిలో ఒక అధికారి రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తూ.. తన పై అధికారితో పంచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ డిపో పరిధిలో ఒక్కో కార్డుకి మూడు రూపాయలు చొప్పున ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పక్క దారి నుంచి పెందుర్తి వైపుగానూ, షీలానగర్ నరవ మీదుగా రేషన్ బియ్యం నల్లబజారుకు తరలిస్తున్నారని తెలిసినా.. సదరు సర్కిల్ అధికారులు అటు వైపు దృష్టి పెట్టరు. ఎందుకంటే అప్పటికే ఆ బియ్యానికి సంబంధించిన వసూళ్లు చేతిలో పడిపోతున్నాయి. సదరు అధికారి రేషన్ డిపోల వద్దకే కాకుండా హోటల్స్, గ్యాస్ ఏజెన్సీల దగ్గర చేతి వాటం ప్రదర్శిస్తున్నారంట. ఎవరైనా మామూళ్లు ఇవ్వకపోతే దాడులు చేసి కేసులు పెడుతున్నట్లు సమాచారం. ప్రతి ప్రాంతంలోనూ రోజూ ఏదో ఒక చోట రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామంటూ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రకటిస్తున్నారు. కేవలం తమ చేయి తడపని వ్యాపారులు, మిల్లర్లు, కూటమి నేతలకు సహకరించని వారిపైనే ఈ దాడులు జరుగుతున్నాయి. కానీ అసలు దొంగల్ని మాత్రం.. విడిచిపెట్టేసి వారికి సంపూర్ణ సహకారాల్ని సివిల్ సప్లై అధికారులు అందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# చంద్రబాబు అంటేనే మోసం

- ఇచ్చిన హామీలు ఏనాడూ నెరవేర్చలేదు
- ప్రజల్లోకి కూటమి ప్రభుత్వ మోసాలను తీసుకువెళ్లాలి
- 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
- శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' క్యూ ఆర్ కోడ్ స్కాన్‌ను ప్రదర్శిస్తున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, తదితరులు

**సాక్షి, విశాఖపట్నం:** రాజకీయాల్లో విశ్వసనీయత, మాట నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని, అయితే చంద్రబాబు తన రాజకీయ జీవితంలో పేదల కోసం ఇచ్చిన హామీలను ఏనాడూ నెరవేర్చలేదని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ముఖ్యమంత్రిగా నాలుగు సార్లు పనిచేసినా మ్యానిఫెస్టో హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆయన దుయ్యబట్టారు. శుక్రవారం మద్దిలపాలెంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ తూర్పు నియోజకవర్గ స్థాయిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' అనే కార్యక్రమాన్ని, చంద్రబాబు మ్యానిఫెస్టో డౌన్‌లోడ్ లోగోను ప్రారంభించారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, వార్డు, అనుబంధ విభాగాల అధ్యక్షులకు ఈ కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అర్హులకు కుల, మత, పార్టీ బేధం లేకుండా సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, ఎల్లో మీడియా తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ, కూటమి ఏడాది పాలనలో హామీలను అమలు చేయలేదని, రైతులు, పేదల కోసం ఆలోచించలేదని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగం అధ్యక్షుడు పేర్ల విజయ్ చందర్, మహంతి, ముఖ్యనేతలు పేడాడ రమణి కుమారి, ఐహెచ్ ఫారూఖీ, గొలగాని శ్రీనివాస్, నడింపల్లి కృష్ణరాజు, మొల్లి లక్ష్మీ, నక్కెళ్ల లక్ష్మీ, పల్లా అప్పలకొండ,బోని శివ రామకృష్ణ, అల్లంపల్లి రాజుబాబు, ద్రోణంరాజు శ్రీ వాత్సవ్, ముర్వల సురేష్, పల్లా దుర్గారావు, నందూరి సత్య శ్రీనివాస్, ఉమ్మడి దాస్, సత్యనారాయణ, పతివాడ కనక రాజు, బొండా శ్రీను, పులగం కొండా రెడ్డి, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, బొండా ఉమా మహేశ్వర రావు, దేవరకొండ మార్కండేయులు పాల్గొన్నారు.

## కాలుష్య నియంత్రణకు పరిశ్రమల ప్రాధాన్యం



ప్రసంగిస్తున్న ఏపీపీసీబీ చైర్మన్ కృష్ణయ్య

**ఏయూక్యాంపస్:** కాలుష్య నియంత్రణ, పర్యా వరణ పరిరక్షణకు పరిశ్రమలు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. విశాఖలో సీఐఐ, ఏపీ పీసీబీ సంయుక్తంగా 'విశాఖ నగరంలో పరిశ్రమల కాలుష్యం' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. పరిశ్రమలు నిర్దిష్ట భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చని, భద్రత, పర్యావరణానికి తొలి ప్రాధాన్యమిచ్చి, ఆ తర్వాతే సంస్థ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. సీఐఐ ఏపీ చైర్మన్ జి.మురళీకృష్ణ మాట్లాడుతూ రియల్ టైంలో పర్యావరణ పర్యవేక్షణ జరగాలన్నారు. గ్రాసిం ఇండస్ట్రీస్ అధ్యక్షుడు ఎస్.నరసింహ శాస్త్రి , ఏయూ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య ఎస్.బాల ప్రసాద్ , సీఐఐ విశాఖ వైస్‌చైర్మన్ జి.కృష్ణ మోహన్, సీఐఐ విశాఖ చైర్మన్ డీవీఎస్ నారాయణరాజు, జాయింట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివ శంకర్, సీఐఐ విశాఖ హెడ్ వి.ఎం మౌళి ప్రసంగించారు.

# పేదరికం నిర్మూలన లక్ష్యంగా 'పీ-4' అమలు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి
డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



మాట్లాడుతున్న మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

**మహారాణిపేట:** రాష్ట్రంలో పేదరికం లేని సమాజాన్ని రూపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ, సచివాలయ, గ్రామ వలంటీర్ల శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పీ–4, స్వర్ణాంధ్ర విజన్ 2047పై జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం పూర్తిగా తొలగించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని మంత్రి తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన 20 శాతం కుటుంబాలను (బంగారు కుటుంబాలు) గుర్తించి, ఆర్థికంగా, విద్యాపరంగా, వ్యక్తిగతంగా స్థిరపడిన వారిచే దత్తత తీసుకునేలా చేస్తామన్నారు. బంగారు కుటుంబాల ఎంపికకు సర్వే జరుగుతోందని, ఆగస్టు 15 లోగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. విశాఖ జిల్లాలో ఇప్పటికే 73,452 బంగారు కుటుంబాలను గుర్తించామని, జూలై 15 నుంచి 28 లోపు సచివాలయ సిబ్బంది ద్వారా పునఃపరిశీలన చేసి తుది జాబితాను రూపొందిస్తామని వివరించారు. దాదాపు 12 వేల మంది సంపన్నులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలను మార్గదర్శులుగా గుర్తించామని, వారితో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. సమావేశంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ప్రభుత్వ విప్‌లు వి.చిరంజీవి రావు, పీవీజీఆర్ఆర్ నాయుడు, మేయర్ పీలా శ్రీనివాస రావు, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, వంశీ కృష్ణ శ్రీనివాస యాదవ్, పి. విష్ణు కుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణ బాబు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్.. యువగళం హామీలు ఏమయ్యాయి?
8లో
జనాభా పెరుగుదలపై అవగాహన అవసరం

## గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపక(గెస్ట్ లెక్చరర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మజ్జి ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మద్దిలపాలెంలోని డా.వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల, అగనంపూడి, ఇస్లాంపేట, పెందుర్తి కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన విశ్రాంత అధ్యాపకులు, స్కూల్ అసిస్టెంట్లు, కనీసం 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించిన ఫ్రెషర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులు, బయోడేటా, సంబంధిత ఒరిజినల్, నెటివిటీ ధ్రువపత్రాలను పీతాపురం కాలనీలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా ఉన్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ ఉదయం 10.30 గంటల్లోగా సమర్పించాలి. మరిన్ని వివరాలకు 0891-2713791 ఫోన్ నంబర్‌కు సంప్రదించవచ్చని వృత్తి విద్యాశాఖాధికారి తెలిపారు. భౌతికశాస్త్రం-1, జంతుశాస్త్రం-1, వృక్షశాస్త్రం-1, ఫిజియోథెరపీ-1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

# తప్పుడు పత్రాలతో భూకబ్జా

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- ప్రభుత్వ అడంగల్ పుస్తకాలు స్వాధీనం

మధురవాడ: తమ తాత, ముత్తాతలకు సంబంధించిన ఆస్తి అని.. అడంగల్, ఎఫ్‌ఎంబీల్లో వారి పేర్లు ఉన్నాయని నమ్మించారు. దానికి జీపీఏ చేయించుకుని తద్వారా సేల్ డీడ్ తయారు చేయించుకున్నారు. ఇలా రిటైర్డ్ ఉద్యోగికి చెందిన భూమిని ఆక్రమించిన ముగ్గురు వ్యక్తులను పీఎంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు శుక్రవారం వివరాలు వెల్లడించారు. 1983 ప్రాంతంలో మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 203 పార్ట్ రేవళ్లపాలెంలోని బ్యాంక్ ఆఫీసర్స్ హౌసింగ్ లే అవుట్‌లో కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఆర్‌ఏస్ఎస్ ప్రకాశరావు, మరికొందరు 300 గజాల చొప్పున ప్లాట్‌లు కొనుగోలు చేశారు. ఇందులో కొందరు మరణించగా మరికొందరి వారసులు దేశ, విదేశాల్లో ఉన్నారు. దీన్ని అదనుగా భావించి మధురవాడ రేవళ్లపాలేనికి చెందిన బెవర అనిల్‌కుమార్, అతని అన్న వెంకటేష్, శ్రీకాకుళం జిల్లా లక్ష్మీపురానికి చెందిన పగోటి దిలీప్‌కుమార్ మరికొంత మంది వ్యక్తులతో కలిసి.. రేవళ్లపాలెం పరిసర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములకు తప్పుడు డాక్యుమెంట్‌లు సృష్టించి అక్రమంగా విక్రయిస్తున్నారు. ఇదే విధంగా అనిల్, దిలీప్‌కుమార్ ఫిర్యాదిదారు అయిన ప్రకాశరావు ఆస్తిని కాకినాడకు చెందిన రామ పద్మజకు అమ్మేశారు. అలాగే గత నెల 28న రేవళ్లపాలెం శ్రీనివాస స్కూల్ సమీపంలోని భూమిలోకి అర్ధరాత్రి కొంత మంది వ్యక్తుల సహాయంతో పొక్లెయిన్, లారీలతో చొరబడి ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఫిర్యాదిదారు అక్కడకు చేరుకుని ఆపే ప్రయత్నం చేయగా.. అతన్ని భయభ్రాంతులకు గురిచేశారు. ఇక్కడ సుమారు ఐదు ప్లాట్‌లకు చెందిన 1,500 గజాల భూమిని ఆక్రమించడానికి ప్రయత్నం చేయడంతో బాధితులు పీఎంపాలెం పోలీసులను ఆశ్రయించారు. విచారణ ప్రారంభించిన సీఐ బాలకృష్ణ, ఎస్ఐ డి.రాము అక్రమార్కులు నకిలీ పత్రాలతో కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తప్పుడు జీపీఏ పొంది.. దాని ద్వారా ఇతరులకు సేల్ డీడ్ చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వీరు 2019, 2025లో కూడా ఇలానే ప్రైవేట్ స్థలాలను విక్రయించినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు నిందితులు అనిల్ కుమార్, వెంకటేష్, దిలీప్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన అడంగల్, ఎఫ్ఎంబీ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ అప్పలరాజు తెలిపారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎంత మంది ఉన్నారనే విషయంపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అప్పలరాజు

# ప్రమాదాల జంక్షన్

- లంకెలపాలెం కూడలిలో బెంబేలెత్తిస్తున్న ప్రమాదాలు
- తాజాగా అదుపుతప్పిన భారీ ట్రాలర్
- ఫ్లైఓవర్ నిర్మించాలని స్థానికుల డిమాండ్

పరవాడ: అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారిలోని లంకెలపాలెం కూడలిలో జరుగుతున్న ప్రమాదాలతో ప్రజలు, ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. డ్రైవర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం తమ పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**శుక్రవారం రాత్రి ఏం జరిగిందంటే?**

విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి ఇనుప ప్లేట్లతో ఖమ్మం వెళ్తున్న ఒక భారీ ట్రాలర్.. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో లంకెలపాలెం కూడలి వద్ద అదుపు తప్పింది. వేగంగా దూసుకొచ్చిన ఈ ట్రాలర్.. ఫ్రీ–లెఫ్ట్ మార్గంలోని సిమెంట్ దిమ్మలను బలంగా ఢీకొని పక్కనే ఉన్న మురుగు కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలవగా, ట్రాలర్ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. రాత్రి సమయం కావడంతో కూడలిలో జన సంచారం లేదు. దీంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు క్రేన్ సహాయంతో ట్రాలర్‌ను తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనపై సీఐ ఆర్.మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. గత నెల 23న విశాఖ నుంచి అనకాపల్లి వెళ్తున్న ఓ లారీ బ్రేకులు విఫలం కావడంతో సిగ్నల్ వద్ద ఆగి ఉన్న జనంపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. గత నెల 3న విశాఖ పోర్టు నుంచి వస్తున్న బొగ్గు లారీ బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఒక కారు, ఆటో ధ్వంసం కాగా, సిగ్నల్ లైట్లు, విద్యుత్ స్తంభం, హైమాస్ట్ లైట్ నేలమట్టమయ్యాయి. రెయిలింగ్ పూర్తిగా దెబ్బతింది. ఆటోలోని నలుగురు గాయపడ్డారు. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ ప్రమాదాల నివారణకు ప్రభుత్వం శాశ్వత చర్యలు చేపట్టాలని, ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ట్రాలర్ ముందుభాగం

## హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

అల్లిపురం: తోపులాటలో కిందపడి.. చికిత్స పొందుతూ మృతి చెందిన యువకుడి కేసులో ఇద్దరిని రెండో పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివి. ఈ నెల 5వ తేదీ రాత్రి కొబ్బరితోట నివాసి గంట్యాడ కనకరాజుకు చెందిన బైక్ పెట్రోల్ అయిపోయి ఆగిపోయింది. దీంతో గీత్ సంగీత్ జంక్షన్‌లో టిఫిన్ చేస్తున్న కొబ్బ

**అనుకోకుండా జరిగిన ఘటనలో యువకుడి మృతి**

రితోట ప్రాంతానికి చెందిన పుక్కల శశికుమార్, నవీన్‌రాజ్‌లను పెట్రోలు ఇమ్మని బలవంతం చేశాడు. వారు కుదరదని చెప్పినా, వారి బైక్‌లో పెట్రోలు తీసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో నిందితులిద్దరూ కనకరాజును నిలువరించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో వారి మధ్య తోపులాట జరగటంతో మద్యం మత్తులో ఉన్న కనకరాజు వెనుకకు తూలిపడ్డాడు. దీంతో తల వెనుక తీవ్ర గాయం కావటంతో.. నిందితులు 108కి ఫోన్ చేసి కనకరాజును కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కనకరాజు ఈ నెల 6వ తేదీ ఉదయం మరణించాడు. చికిత్స సమయంలో జరిగిన విషయాన్ని కనకరాజు తన అక్కకు తెలియజేయడంతో.. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనుకోకుండా జరిగిన తోపులాటలో కనకరాజు తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మరణించాడని పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసి నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించారు.





# లోకేష్.. యువగళం హామీలు ఏమయ్యాయి?

**జీవో 77 రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆందోళన**

మహారాణిపేట: యువగళం పాదయాత్రలో నారా లోకేష్ విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ప్రైవేట్ పీజీ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను మోసం చేశారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నో హామీలు ఇచ్చారని, అధికారంలోకి రాగానే జీవో నంబర్ 77ను వంద రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ జీవో ద్వారా అనేక మంది విద్యార్థులు పీజీ విద్యకు దూరం అవుతున్నారని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత బడ్జెట్ సమావేశాల సమయంలో రూ.2,600 కోట్లు విడుదల చేస్తామని చెప్పి, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విద్యార్థులకు అందించలేదన్నారు. డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్ విధానంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇవన్నీ చేయకుండా కేవలం పీటీఎం పెట్టినంత మాత్రాన ఉపయోగం లేదని.. ఇది ముమ్మాటికీ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేయడమే అని నాగరాజు అన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమితి జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్, సహాయ కార్యదర్శి హేమానంద్, ఉపాధ్యక్షుడు జే.అభిషేక్, కార్యవర్గ సభ్యులు గ్రేస్ ప్రకాష్, గణేష్, సూర్య, అభి తదితరులు పాల్గొన్నారు.




కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు

# కేసుల రాజీతో సత్వర పరిష్కారం

విశాఖ లీగల్: కేసులను సామరస్యపూర్వక వాతావరణంలో రాజీ చేసుకోవడం మంచిదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు న్యాయవాదులకు సూచించారు. శుక్రవారం న్యాయవాదుల నూతన సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో ప్రయోజనకరమన్నారు. మధ్యవర్తిత్వం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించడానికి 90 రోజుల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే మధ్యవర్తిత్వం ద్వారా ప్రయోజనాలు పొందవచ్చన్నారు. న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వ విధానాన్ని అవలంబించాలని సూచించారు. న్యాయవాదులందరూ ఈ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అవసరమైతే ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమాలు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో 90 రోజుల పాటు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఎల్.పి. నాయుడు, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

# సమన్వయంతో 'ఐఎఫ్ఆర్' విజయవంతం

## కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో 2026 ఫిబ్రవరిలో జరగనున్న ఐ.ఎఫ్.ఆర్/మిలన్, ఐవోఎన్ఎస్ కాంక్లేవ్ ఆఫ్ చీఫ్స్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నేవీ, ఎయిర్‌పోర్టు, పోర్ట్ అథారిటీ, కస్టమ్స్, రెవెన్యూ, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, పోలీసు, పర్యాటక శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా విభాగాలు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. తొలుత కమోడోర్ ఏబీ మాథ్యూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల విధులను వివరించి.. వారి సహకారాన్ని కోరారు. సమావేశంలో నేవల్ ఆఫీస్ ఇన్‌చార్జి(ఏపీ) రజనీష్ శర్మ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, నేవల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

# జనాభా పెరుగుదలపై అవగాహన అవసరం

మద్దిలపాలెం: విద్యకు అత్యధిక ప్రాధాన్యమివ్వడం, జనాభాకు అనుగుణంగా సమాన అవకాశాలు కల్పించడం, సమాజంలో సమానత్వాన్ని స్థాపించడం ఎంతో ముఖ్యమని ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏయూలో శుక్రవారం జరిగిన వేడుకల్లో వీసీ మాట్లాడారు. వికసిత భారత్ ఆశయాలను సాకారం చేసే దిశగా యువతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది సంవత్సరంలో విద్యను అభ్యసిస్తున్న యువతను ఈ సందర్భంగా వీసీ అభినందించారు. జపాన్ దేశంలో జనాభా వృద్ధి తగ్గిపోవడం, వృద్ధుల జనాభా పెరగడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) పూర్వ ఆచార్యులు టి.జె.రావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పడే పర్యవసానాలను అర్థం చేసుకోవాలని సూచించారు. కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ఎస్.రామకృష్ణారావు పర్యావరణహిత జీవనంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.రాజు మాట్లాడుతూ జనాభా అభివృద్ధి జరిగే సమయంలో తగిన పోషకాహారం, సరైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం ముఖ్యమన్నారు. జనాభా అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య బి.మునిస్వామి దేశవ్యాప్తంగా 18 జనాభా అధ్యయన కేంద్రాలు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.



మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్



## ఉక్కు పైలాన్ చుట్టూ కంచె


**ఉక్కు కార్మికుల ఆందోళనకు మరో అడ్డంకి**

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని పైలాన్ వద్ద జరుగుతున్న కార్మికుల దీక్షకు యాజమాన్యం అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆందోళనకారులు ఏర్పాటు చేసిన టెంట్ కూలిపోగా, దాన్ని తిరిగి నిర్మించుకోవడానికి యాజమాన్యం అనుమతించకుండా, అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసింది. దీంతో కార్మికులు ఎండకు, వానకు గొడుగులు పట్టుకొని నిరసన కొనసాగిస్తున్నారు. తాజాగా ఉక్కు యాజమాన్యం పైలాన్ ప్రాంతం చుట్టూ కంచె వేసి, కార్మికులు ఆ ప్రాంతంలోకి అడుగు పెట్టకుండా నిరోధించింది. యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, న్యాయబద్ధంగా నిరసన తెలిపే హక్కును హరిస్తోందని కార్మికులు, కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఈ అంశంపై ఇప్పటికే న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉండగా, యాజమాన్యం ఇలాంటి చర్యలు తీసుకోవడం సమంజసం కాదని కార్మిక నాయకులు పేర్కొంటున్నారు. యాజమాన్యం తమ నిర్ణయాన్ని మార్చుకొని, కార్మికులు శాంతియుతంగా ఆందోళన చేసుకోవడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



## కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లకు సత్కారం

మహారాణిపేట: గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించినందుకు గానూ కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌లను సింహాచలం దేవస్థానం ఈవో వి. త్రినాథరావు ఘనంగా సత్కరించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఈవో వేండ్ర త్రినాథరావు, ఈఈ సీహెచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్,జీవీఎంసీ కమిషనర్‌కు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.



కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లను సత్కరిస్తున్న సింహాచలం ఈవో

## చోరీ కేసులో దొంగను పట్టేశారు

**రూ.3 లక్షల విలువైన బంగారం స్వాధీనం**

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో ఇటీవల జరిగిన దొంగతనం కేసును క్రైం విభాగం పోలీసులు ఛేదించినట్లు ద్వారకా క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో క్రైం సీఐ వి.చక్రధరరావు, ఎస్ఐ హరికృష్ణతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరిలోవ ప్రాంతంలోని వివేకానందనగర్‌లో నివాసముంటున్న దర్శిని ప్రియ తన భర్తతో కలిసి ఈ నెల 3న పార్వతీపురం మన్యం జిల్లా వడ్డింగి వెళ్లారు. తిరిగి ఈ నెల 7న ఇంటికి చేరుకునే సరికి.. ఇంటి వెనుక తలుపు పగలగొట్టి ఉంది. ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. ఐరన్ అలమరాలో దాచిపెట్టిన మూడు పేర్ల బంగారు నెక్లెస్, ఉంగరం, బ్రాస్‌లెట్ కనిపించలేదు. దీంతో ఆమె ఈ నెల 8న క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం ఎస్ఐ హరికృష్ణ, సిబ్బందితో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా తోటగరువుకు చెందిన విశకట్ల సాయికుమార్ అలియాస్ ఇంజిన్ సాయి దొంగతనం చేసినట్లు గుర్తించారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పాతడెయిరీఫారం వద్ద అతన్ని పట్టుకున్నారు. తమదైన శైలిలో పోలీసులు ప్రశ్నించడంతో దొంగతనం చేసినట్లు సాయి అంగీకరించాడు. అతని నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3 లక్షలు ఉంటుందని, సీపీ సూచనల మేరకు వాటిని బాధితురాలికి అప్పగిస్తామని ఏసీపీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఫిర్యాదు స్వీకరించి.. నాలుగు రోజుల్లో దొంగను పట్టుకున్న ఎస్ఐ హరికృష్ణ, సిబ్బందిని ఆయన అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ద్వారకా క్రైం ఏసీపీ లక్ష్మణరావు

# సముద్రంలో మునిగిన బోటు

**అధికారులు పట్టించుకోలేదని యజమాని ఆవేదన**

మహారాణిపేట: సముద్రంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వేటకు వెళ్లే మత్స్యకారులంటే అధికారులకు ఇంత నిర్లక్ష్యమా అని మునిగిపోయిన బోటు(నంబర్ 594) యజమాని వాసుపల్లి ధనరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'మా బోటు మునిగిపోయింది. పది మంది మత్స్యకారులు సముద్రంలో చిక్కుకుపోయారని చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు' అని ఆయన శుక్రవారం 'సాక్షి'కి వివరించారు. ఈ ఘటనలో సుమారు రూ. 70 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు.

**ఏం జరిగిందంటే..**

ఈ నెల 8న విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి వేటకు వెళ్లిన బోటు శ్రీకాకుళం జిల్లా కొయ్యాం గ్రామానికి సుమారు 45 నాటికల్ మైళ్ల దూరంలో బుధవారం రాత్రి బోల్తా పడిందని ధనరాజు తెలిపారు. అదృష్టవశాత్తూ బోటులో ఉన్న పది మంది మత్స్యకారులు క్షేమంగా, సురక్షితంగా గురువారం ఒడ్డుకు చేరుకున్నారు. 'బోటు మునిగిపోయిన వెంటనే మెరైన్ పోలీసులు, సివిల్ పోలీసులు, మత్స్యశాఖ, కోస్ట్ గార్డ్ వంటి అధికారులందరికీ ఫోన్ చేసి తెలియజేశాను. కానీ, మమ్మల్ని పట్టించుకునేవారే లేరు. ఆపదలో ఉన్న మత్స్యకారులంటే అందరికీ అలుసేనా?' అని ఆయన ప్రశ్నించారు. 'ఒకవైపు మా బోటు పోయింది. మరోవైపు పది మంది మత్స్యకారులు ఎన్నో గంటలపాటు సముద్రంలో ఈత కొట్టుకుంటూ ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం ఇచ్చిన తర్వాత 'ఎవరైనా చనిపోయారా?' అని అడిగారే తప్ప, సహాయం చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడం చాలా బాధ కలిగించింది' అని ధనరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులు

## ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై లెజిస్లేచర్ కమిటీ సమీక్ష

మహారాణిపేట: ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణ, కార్యకలాపాలు, పనితీరు, అకౌంట్ల ఆడిటింగ్‌పై పరిశీలనకు ఏర్పాటైన లెజిస్లేచర్ కమిటీ, శుక్రవారం విశాఖ పర్యటనను ప్రారంభించింది. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షతన కమిటీ జిల్లాకు చేరుకుని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైంది. కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేష్, పర్యాటక సంస్థ డివిజనల్ మేనేజర్ జగదీష్, జిల్లా పర్యాటక అధికారి మాధవి, ఏపీఐఐసీ అధికారులు తమ సంస్థల పనితీరును వివరించారు. చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ 16 ఏళ్ల తర్వాత ఈ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును మదింపు చేసి, వాటి ఆర్థిక నిర్వహణపై నివేదికలను పరిశీలించి, మెరుగుదల కోసం ప్రభుత్వానికి సూచనలు చేస్తామని చెప్పారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యక్రమాలను, చేపట్టిన ప్రాజెక్టులను జీవీఎంసీ కమిషనర్ వివరించగా, వీఎంఆర్డీఏ కార్యకలాపాలను జాయింట్ కమిషనర్ రమేష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. కమిటీ సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కాంట్రాక్టర్ ఐజాక్ భాషా, నడికుదిటి ఈశ్వరరావు, ఆర్.వి.ఎస్.కె.కె. రంగారావు, గిడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ కూన రవికుమార్

## పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

సబ్బవరం: బాలిక అదృశ్యం కేసులో స్థానిక పోలీసులు ఓ యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి, శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లా మందస మండలంలోని బుడారిసింగ్ గ్రామానికి చెందిన పసుపులేటి హరిబాబు కుటుంబ సభ్యులతో సబ్బవరంలోని సాయినగర్‌లోని అద్దె ఇంట్లో నివాసం ఉంటూ, అనకపల్లి ప్రాంతంలో నర్సరీ నడుపుతున్నాడు. అతని కుమారుడు తేజ(19) తాము అద్దెకు ఉంటున్న యజమాని కుమార్తెతో పరిచయం పెంచుకున్నాడు. మేలో ఎవరికీ తెలియకుండా బాలికను అపహరించుకు పోవడంతో ఆమె తండ్రి సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఒడిశా రాష్ట్రంలో ఉన్న తేజను గురువారం పట్టుకుని, బాలిక స్టేట్‌మెంట్ మేరకు అరెస్ట్ చేశారు. అతనితో పాటు పట్టుబడిన బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువకుడిని రిమాండ్‌కు తరలించారు.